క్లుప్తంగా

బ్లీచింగ్ బ్యాగుల అందజేత



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో నిర్వాహకులకు బ్లీచింగ్ పౌడర్ బ్యాగులను శుక్రవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి యాదగిరి అందజేశారు. ఈ సందర్భంగా చర్చి సభ్యులు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో చర్చి పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఈ విషయాన్ని యాదగిరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన బ్లీచింగ్ పౌడర్ బ్యాగ్‌లను అందజేశారని తెలిపారు.

పింఛన్ పెంపుపై హర్షం

రామారెడ్డి: దివ్యాంగులకు పింఛన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ పోసానిపేటలో దివ్యాంగుల కమిటీ ఆధ్వర్యంలో పోసానిపేటలో సీఎం చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల కన్నా ఎక్కువ పింఛన్ ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. దివ్యాంగులు మాట్లాడుతూ.. ప్రజలంతా కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు మంగలి స్వామి, దివ్యాంగులు పోతుల బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు

నూతన కార్యవర్గం



భిక్కనూరు: మండల కేంద్రంలోని వర్తకం సంఘం అడ్‌హక్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వర్తక సంఘం భవనంలో సమావేశమైన సభ్యులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పబ్బ నాగరాజు, అధ్యక్షుడిగా తాటిపాముల లింబాద్రి, ఉపాధ్యాక్షులుగా గుంటుకు బాల్‌చంద్రం, పురాం రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా అతిమాముల రమేశ్, కోశాధికారిగా చీకోటి నాగభూషణం, సలహాదారులుగా నంద రమేశ్, గుంటుకు రాజు, గజవాడ నాగరాజు, అతిమాముల శ్రీధర్, బూర్ల రేణుకుమార్, జేపీ. సిద్దగౌడ్, బీఎస్. చంద్రమోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు పబ్బ నాగరాజు, అధ్యక్షుడు లింబాద్రిలు మాట్లాడుతూ.. వర్తక సంఘం అభ్యున్నతికి పాటుపడుతామని అన్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు గంగల్లి మధుసూదన్, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

లంబాడీ స్టూడెంట్ కమిటీ..

బిచ్కుంద(జుక్కల్): మండల లంబాడీ స్టూడెంట్ ఆర్గనైజేషన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని జిల్లా అధ్యక్షుడు జీవన నాయక్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా గణేశ్ నాయక్, కార్యదర్శిగా అశోక్ నాయక్, సహాయ కార్యదర్శిగా హీరాలాల్‌ను ఎన్నుకున్నారు. బడి బయట ఉన్న గిరిజన, లంబాడీ పిల్లలను గుర్తించి విద్య ప్రాధాన్యత తెలియజేసి పాఠశాల, కళాశాలకు పంపించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 90వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం గ్రామస్తులు ఒంటి కాలిపై నిలబడి, కళ్లు మూసుకుని ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి కాపాడాలంటూ నినదించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు దీక్షా శిబిరంలో నిరసన వ్యక్తం చేశారు. వీడీసీ అధ్యక్షుడు మైపాల్ మాట్లాడుతూ..ఐదు రోజుల్లో ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు కమిటీని ఏర్పాటు చేసి వ్యర్థాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చెక్కుల పంపిణీ



మద్నూర్: మండలంలోని మదన్‌హిప్పర్గ గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ రాజు పటేల్ ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన హన్మంత్‌రావుకు రూ.30,500, రమాకు రూ.60 వేలు, భూదేవికి రూ.14,500, నిర్మలా బాయికి రూ.16,500 చొప్పున చెక్కులు మంజూరయ్యాయన్నారు. నాయకులు విలాస్, విఠల్‌రావు, వెంకట్ పటేల్, హన్మంత్, ప్రకాష్ పాటిల్, నాని తదితరులు పాల్గొన్నారు.

తండాలకు తారు రోడ్డు ఏదీ?

- గుంతలమయంగా మారిన తండాల రోడ్లు
- చినుకు పడితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- సమస్య పరిష్కరించాలని తండావాసుల వినతి



బురదమయంగా మారిన శేర్‌శంకర్ తండా రోడ్డు

రాజంపేట: చినుకు పడితే తండాలకు వెళ్లే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. రాజంపేట మండలంలో శేర్‌శంక్ తండా, నడిమితండా, గుడితండా రోడ్లతో పాటు పలు తండాల రోడ్లు అధ్వానంగా మారుతున్నాయని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండాపూర్ నుంచి గుడి తండాకు బీటీ రోడ్డు మంజూరైనా ఏడాది క్రితం సంబంధిత కాంట్రాక్టర్ కంకర వేసి వదిలేశాడు. దీంతో తండా వాసులు ఈ కంకర వేసిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. దీనికి తోడు భారీ వర్షం కురిస్తే తండాకు వెళ్లే దారిలో వాగుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎల్లారెడ్డిపల్లి నుంచి శేర్ శంకర్ తండాకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించి దాదాపు రెండున్నరేళ్లు కావస్తున్నా అటవీ శాఖ అధికారులు అభ్యంతరం తెలపడంతో ఎల్లారెడ్డిపల్లి తండా వరకే బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వర్షం పడితే ఎల్లారెడ్డి పల్లి నుంచి శేర్‌శంకర్ తండాకు వెళ్లాలంటే తండా వాసులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ప్రయాణం చేయలేకపోతున్నాం



తండా నుంచి ఎల్లారెడ్డిపల్లి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వర్షం పడితే రోడ్డు మొత్తం బురదమయం అవుతోంది. ద్విచక్రవాహనాలపై వెళ్లినపుడు కింద పడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మట్టి రోడ్డు సైతం పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. వాహనాలపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా రోడ్డు పనులు అయ్యేలా చూడాలి.

– కాట్రోత్ సురేందర్, శేర్‌శంకర్ తండా

ప్రమాదకరంగా మూలమలుపు

- అనుమతులు రాక రోడ్డు వెడల్పు చేయని అధికారులు



కట్టె డిపో సమీపంలో ప్రమాదకరంగా ఉన్న సింగిల్ రోడ్డు

రామారెడ్డి: అటవీ శాఖ నుంచి అనుమతులు రాక సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరణకు నోచుకోవడం లేదు. దీంతో సింగిల్ రోడ్డుపై రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. రామారెడ్డి మండల కేంద్రం నుంచి మద్దికుంట మర్రి వరకు 2017లో రూ.13 కోట్ల నిధులతో డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రామారెడ్డి శివారులోని కట్టె డిపో దగ్గర అటవీ ప్రాంతం ఉండటంతో డబుల్ రోడ్డు విస్తరణ పనులకు కిలోమీటర్ మేర బ్రేక్‌లు పడ్డాయి. దీనికి తోడు అక్కడే ప్రమాదకరమైన మూలమలుపు ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై గతంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సైతం రామారెడ్డి సర్వసభ్య సమావేశంలో స్పందించారు. అటవీశాఖ నుంచి అనుమతులు వచ్చేలా కృషి చేస్తానని, అప్పటివరకు సింగిల్ రోడ్డుకు ఇరువైపులా మొరం వేయించాలని సూచించారు. ఇరువైపులా మొరం వేసినా వర్షాకాలంలో ఆ మొరం పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో మళ్లీ రోడ్డు పరిస్థితి మొదటికి వచ్చింది. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో పీర్ల ప్రతిష్ఠాపన



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మసీదుల్లో పీర్లను ప్రతిష్ఠించారు. నెలవంక రావడంతో మొహరం నెల ప్రారంభమైంది. ఈ నెల 29న మొహరం పండుగ చేసుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలెహజార్, మారేమామ, లాల్‌సాబ్, కాశీందులా, హుస్సేని ఆలం పీర్లు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కుడుకలు, బెల్లం పోసి మొక్కులు తీర్చుకుంటున్నారు.

లోపించిన పారిశుధ్యం



లింగంపేట: బీసీ వసతిగృహం పక్కన చెత్తాచెదారం



కల్లు దుకాణం పక్కన మురికి కూపం

- కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్త

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయితీ కార్మికుల సమ్మె కారణంగా లింగంపేట మండల కేంద్రంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. 15 రోజులుగా ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండడంతో జనావాసాల వద్ద దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మురికి కాల్వల నీరు రోడ్లపై వచ్చి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



బాన్సువాడ పట్టణానికి ర్యాలీగా వస్తున్న భాస్కర్ రెడ్డి



కేక్ తినిపిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి పిట్లం మీదుగా బాన్సువాడకు వచ్చిన భాస్కర్‌రెడ్డికి అడుగడుగునా జనం నీరాజనం పట్టారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పవిత్ర పుణ్యక్షేత్రం కాశీలో సుదర్శన దండి స్వామిజీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నస్రుల్లాబాద్‌లో..

– బాన్సువాడ/నస్రుల్లాబాద్

సమాచారం..

నేడు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి ఐకేపీ కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం రవీందర్ తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

సిద్ధరామేశ్వరనగర్‌కు ప్రభుత్వ విప్ రాక

భిక్కనూరు: సిద్ధరామేశ్వరనగర్ గ్రామానికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఈనెల 24(నేడు)న విచ్చేస్తున్నట్లు ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ జనగామ శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం వారు భిక్కనూరులో మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభిస్తారని చెప్పారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఐదు ఎకరాల లోపు అనువైన భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ భూమి పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు జిరాక్స్‌లను దరఖాస్తు ఫాంతో జతచేసి మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వంట మనిషి పోస్టుకు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో ఖాళీగా ఉన్న వంట మనిషి పోస్టుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ వీణ తెలిపారు. పదో తరగతి పాసై ఆరేళ్లపాటు హాస్టళ్లలో పనిచేసిన అనుభవం లేదా ఎక్కువ మందికి వంటచేసిన అనుభవం ఉండాలని ఆమె చెప్పారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 27లోపు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

24,25, 26 తేదీల్లో సభ్యత నమోదు

కామారెడ్డి అర్బన్: ఈనెల 24, 25, 26 తేదీల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదర్‌రెడ్డి, ఎ.కుశాల్‌లు తెలిపారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులందరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి



భిక్కనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు



కామారెడ్డి పట్టణంలో..

భిక్కనూరు: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు ప్రధాని నరేంద్ర మోదీ కారణమంటూ భిక్కనూరు మండల కేంద్రంలో క్రైస్తవ, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక చౌరస్తా వద్ద పాత జాతీయ రహదారిపై అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. మోదీ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఘటనలకు కారణమైన వారిని బహిరంగంగా ఉరితీయాలని కోరారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులను శాంతింపజేసి ఆందోళన విరమింపజేశారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి అర్బన్: మణిపూర్‌లో జరిగిన దాడులను నిరసిస్తూ ఆదివారం క్రైస్తవులు, వివిధ ప్రజా సంఘాలు నేతలు కామారెడ్డి సీఎస్ఐ చర్చి నుంచి ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో దాస్‌ఎల్లం, పాస్టర్లు జోసెఫ్ కిషోర్, మాణిక్యం, సాప శ్రీనివాస్, మోజెస్, హోసన్నా, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతల్ని పూడ్చివేశారు

సాక్షి ఎఫెక్ట్..



మాచారెడ్డి: అధ్వానంగా మారిన రోడ్డు శీర్షికన ఈ నెల 21న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రం నుంచి గజ్యానాయక్ తండా మీదుగా ఘన్‌పూర్ వరకు నిర్మిస్తున్న నాలుగు లేన్ల రోడ్డు ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి గుంతలు పడి ప్రయాణించడానికి వీలు లేకుండా మారింది. అధికారులు స్పందించి ఆదివారం గుంతల్ని పూడ్చి వేయించారు.

గౌడ సంఘం భవనానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనానికి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ ఆదివారం భూమిపూజ చేశారు. రూ.10 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ భవనానికి ఆయన పూజలు నిర్వహించారు. పనులు నాణ్యతతో చేయాలని నిర్వాహకులకు సూచించారు. కౌన్సిలర్ శ్రీకాంత్, గౌడ సంఘం నాయకులు ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

రోడ్లపైనే పశువులు



కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై తిష్టవేసిన పశువుల మంద

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి- ఎల్లారెడ్డి ప్రధాన రోడ్లు పశువులకు నివాసాలుగా మారాయి. ప్రతి రోజూ పశువులు రోడ్లపై రాత్రింబవళ్లు తిష్ట వేస్తుండడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. నెల రోజుల క్రితం వాహనం ఢీకొని ఒక పశువు మృతి చెందింది. దాంతో డ్రైవర్‌తో పశువుల యజమాని గొడవకు దిగి జరిమానా విధించారు. అదే పశువులకు ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తులు ఢీకొంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. లింగంపేట ఎస్సై శంకర్ రోడ్డుపై పశువులు ఉంటే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. అయినా పశువుల యజమానులు ఎస్సై ఆదేశాలను భేఖాతరు చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు, ప్రజలు పశువుల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



లింగంపేటలో ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



జుక్కల్‌లో..

జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా ఆదివారం పలు చోట్ల కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల నేతలు జీపీ కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె ఆపబోమని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

– నస్రుల్లాబాద్/భిక్కనూరు/లింగంపేట/నిజాంసాగర్

తాత్కాలిక మరమ్మతులు



మొరం వేయిస్తున్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లి శివారులో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద ఆదివారం అధికారులు తాత్కాలికంగా రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వారం రోజులుగా కురిసిన వర్షానికి బ్రిడ్జ్ పక్కన వేసిన రోడ్డు పూర్తిగా కొట్టుకు పోయింది. దీంతో నాలుగు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ స్పందించి బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు బ్రిడ్జి పక్కన జేసీబీ సాయంతో తాత్కాలికంగా రోడ్డును వేశారు. దీంతో ప్రయాణానికి అడ్డు తొలగింది.

సంక్షిప్తం

ధ్రువపత్రాలు వాహనంతో పాటు ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ధ్రువ పత్రాలను వాహనంతో పాటే ఉంచుకోవాలని ఏఎస్సై రాములు వాహనదారులకు సూచించారు. ఆదివారం పోచారం చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. పోలీస్ సిబ్బంది సాయి శివ, రవి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మద్నూర్: వాహనాలు నడిపేవారు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకుని, పాటించాలని మద్నూర్ ఎస్సై కృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ఆయన సలబత్‌పూర్ సరిహద్దులో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.ఆయన వెంట కానిస్టేబుల్ ప్రమోద్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేనివారికి, హెల్మెట్లు ధరించని వారికి జరిమానా విధించారు. ఎస్సై ఆంజనేయులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రంథాలయాల ద్వారా పుస్తక పరిజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ సూచించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా గ్రంథాలయం కార్యాలయంలో భూంపల్లి మినీ గ్రంథాలయానికి అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు, శివాజీ రావు, నాగభూషణం, తదితరులున్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాశ్ రెడ్డి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గ్రామీణ సంచార వైద్య శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు కోతి లింగారెడ్డి, జనగామ రాజు, నర్సారెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

అలరించిన భగవద్గీత సత్సంగం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మెడికల్ అసోసియేషన్ భవనంలోని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్)లో ఆదివారం ఉదయం భగవద్గీత సత్సంగం నిర్వహించారు. భజనలు, కీర్తనలు ఆలపించడంతో పాటు భగవద్గీత ప్రవచనాలు, హరేకృష్ణ జపం, దీపరాధన, అనంతరం అన్నప్రసాదం వితరణ కార్యక్రమాలు చేశారు.

27 నుంచి 31 వరకు ఎస్ఎఫ్ఐ జీపు యాత్ర

కామారెడ్డి అర్బన్: విద్యా రంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27 నుంచి 31 వరకు జిల్లాలో జీపుయాత్ర నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రవి మాట్లాడారు. తెలంగాణలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం అయిందనిఅన్నారు. జిల్లాలో 5 రోజుల పాటు నిర్వహించే జీపుయాత్రలో విద్యార్థులు, మేధావులు పాల్గొనాలని కోరారు.